సాక్షి
వికారాబాద్
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



తాగునీటి వెతలు

తాండూరు మండలం ఓగిపూర్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి వసతి లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 8లో▸



యథేచ్ఛగా మట్టి దందా!

దోమ మండలం మల్లేపల్లి తండాలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



రోడ్డు ఇలా..

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం కారణంగా గ్రామీణ రహదారులన్నీ అధ్వానంగా మారాయి. 9లో▸

హస్తంలో లుకలుకలు

కాంగ్రెస్‌లో తలనొప్పిగా మారిన గ్రూపు రాజకీయాలు

- నవాబుపేటలో ఎమ్మెల్యే కాలె వర్సెస్ భీంభరత్
- తాండూరులో సై అంటే సై అంటున్న మనోహర్‌రెడ్డి.. మహేందర్‌రెడ్డి వర్గీయులు
- వికారాబాద్‌లో ద్వితీయ శ్రేణి గ్రూపులు
- ఇమడలేక పార్టీ వీడుతున్న నేతలు
- ఇటీవల బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నవాబుపేట మాజీ వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్

వికారాబాద్: జిల్లాలో అధికార పార్టీ సంప్రదాయానికి భిన్నమైన పరిస్థితి ఎదుర్కొంటోంది. సాధారణంగా ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పార్టీలోకి వలసలు కనిపిస్తాయి. కానీ కాంగ్రెస్ నేతలు ప్రతిపక్ష పార్టీలో చేరుతుండటం హస్తం ముఖ్య నేతలను కలవర పెడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ ఇలాంటి ఘటనలు నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. గ్రూపు తగాదాలు.. ముఖ్య నేతలతో ఇమడలేక పలువురు పార్టీ వీడు తున్నట్లు తెలుస్తోంది. దీన్ని బీఆర్‌ఎస్ అనుకూలంగా మలుచుకుంటోంది. అధికార పార్టీ పాలనలో విఫలమైందని.. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని ప్రచారం చేస్తోంది. ఈ కారణంగానే బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు చేరుతున్నారని ప్రచారం చేస్తున్నారు. వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలతోపాటు చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలంలో గ్రూపు రాజకీయాల కారణంగా అధికార పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు.

గ్రూపులతో సతమతం

తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలతో పాటు నవాబుపేట మండలంలో అధికార కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు అధికంగా కనిపిస్తున్నాయి. పరిగి, కొడంగల్‌లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ఒక ప్రాంతంలో ముఖ్య నేతలే గ్రూపులకు కారణం కాగా.. మరో చోట ద్వితీయ శ్రేణి నాయకత్వంలో నెలకొన్న పోటీ కారణమవుతోంది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సొంత మండలం నవాబుపేటలో గ్రూపు విభేదాలు అధికంగా కనిపిస్తున్నాయి. యాదయ్య వర్గంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన భీంభరత్ వర్గం మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎవరికి వారు బలం నిరూపించుకునే పనిలో ఉన్నారు. దీంతో రెండుగా విడిపోయారు. ఎమ్మెల్యే యాదయ్య బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి వారిద్దరి మధ్య పొసగడం లేదు. ఆధిపత్య పోరు గ్రూపులకు ఆజ్యం పోసినట్లయ్యింది.

తాండూరులో..

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మధ్య దూరం పెరిగింది. ఇద్దరూ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారే. వీరిద్దరికీ బలమైన గ్రూపులు ఉండటంతో ఒకరంటే ఒకరికి పడటం లేదు. ఇక వికారాబాద్ నియోజకవర్గంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరే ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన నేతలతో కాంగ్రెస్ నాయకులకు పడటం లేదు. తరచూ తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒకరినొకరు తోసుకునే వరకు వచ్చింది. నువ్వెంత అంటే నువ్వెంత అనే దాకా దారి తీసింది. నాయకుల తీరు స్పీకర్‌కు తలనొప్పిగా మారింది.

సొంత పార్టీ వీడి..

రెండు మూడు నెలలుగా కొంతమంది హస్తం పార్టీ నేతలు సొంత పార్టీలో ఇమడలేక ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా నవాబుపేట మండల మాజీ వైస్ ఎంపీపీ వర్గపోరు భరించలేక తన అనుచరులతో కలిసి కారు పార్టీలో చేరారు. ఇటీవల వికారాబాద్ నియోజకవర్గంలో సైతం పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటల కారణంగా ముఖ్యనేతలు ఇబ్బంది పడుతున్నారు. నాయకుల తీరు అధికారులకూ తలనొప్పి తెచ్చిపెడుతోంది. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తోపాటు వారి వర్గాల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. వికారాబాద్ నియోజకవర్గంతో పాటు నవాబుపేట మండలంలోనూ ఓ వర్గం నేతలో మాట్లాడితే మరో వర్గం నేతలు సదరు అధికారులపై కక్షగడుతున్నారు. సాధారణంగా మాట్లాడినా ఫలానా వర్గానికి అనుకూలమంటూ ముద్ర వేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖలపై ఈ ప్రభా వం ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సైతం వర్గపోరు కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



పోలీసుల అదుపులో అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్
- నిరసనకారులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

తాండూరు టౌన్: ప్రీ ప్రైమరీ స్కూళ్లను, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం ఆందోళనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సంబంధిత శాఖ మంత్రి ఇళ్ల ముట్టడితో పాటు కొడంగల్‌లో సైతం నిరశన వ్యక్తం చేయాలని అనుకున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ స్కూళ్లను, పీఎంశ్రీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన చిన్నారులు ప్రీ ప్రైమరీ స్కూళ్లకు వెళ్లే అంగన్‌వాడీ సెంటర్లు ఖాళీ అవుతాయన్నారు. కేంద్రాలను మూసేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటివి తీసుకురావాలని చూస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లను అంగన్‌వాడీ కేంద్రంలోనే ఏర్పాటు చేసి, దానికి అదనంగా వేతనాన్ని టీచర్లకు ఇవ్వాలన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18వేలు, పీఎఫ్ చెల్లించాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గతంలో చేసిన 24 రోజుల సమ్మెకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. ఆదివారం రాత్రి కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో స్థానిక ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జక్లపల్లి కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, దిశ కమిటీ జిల్లా సభ్యులు జానకీరాం, పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకులు చంద్రలింగం, కృష్ణయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ప్రహ్లాదరావు

న్యూస్‌రీల్

పింఛన్ వెంటనే పెంచాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున



డీటీ నర్సింహులుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

దోమ: ఎన్నికల సమయంలో ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు దివ్యాంగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా దివ్యాంగుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు రెండేళ్లు కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. వెంటనే పింఛన్ మొత్తం పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బందేయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చుక్కయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి లక్ష్మణ్, శ్రీ సంతోషిమాత విభిన్న ప్రతిభావంతుల సంఘం మండల మీడియా కన్వీనర్ కుర్వ ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితులు

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులు సోమవారం ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు ఇప్పటి వరకు తమను సంప్రదించలేదని, ఏ విషయం చెప్పడం లేదని ఆరోపించారు. జాతర స్థలంలో ఇంటి స్థలం ఇస్తామని అధికారులు చెబుతున్నారని అక్కడ బాగా లేదని తెలిపారు. ఆలయ విస్తరణలో భాగంగా ఆలయం చుట్టూ ఉన్న ప్రైవేటు స్థలాన్ని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆలయం చుట్టూ ఉన్న 96 మంది నుంచి 8,736 గజాల స్థలం సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని అన్నారు.

రాష్ట్రస్థాయి పికిల్ బాల్ టోర్నీ విజేత జయశ్రీ



గోల్డ్ మెడల్ అందుకున్న పటేల్ జయశ్రీ

తాండూరు టౌన్: తెలంగాణ స్టేట్ ఓపెన్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తాండూరు వాసి పటేల్ జయశ్రీ విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సొంతం చేసుకున్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో, 35 సంవత్సరాల వయసు విభాగంలో ఆమె ఈ ఘనత సాధించారు. బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఆటల పోటీల్లో పాల్గొనాలన్నారు. నిత్యం వ్యాయామం చేస్తూ మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయిలో సైతం గోల్డ్ మెడల్ సాధించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. జయశ్రీని తాండూరు వాసులు అభినందించారు.

ప్రతి శిశువుకూ పోలియో చుక్కలు వేయించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పుట్టిన ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల లోపు 4.90 లక్షల మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్టోబర్ 12న పోలియో బూత్‌ల్లో, 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

ఎస్ఐఆర్ నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: స్పెషల్ ఇన్సెంటీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం ఎస్ఐఆర్ – 2002పై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి నగరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 2002 ఓటరు జాబితాను 2025 జాబితాతో సరి చూసుకొని త్వరగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈఆర్ఓ అలీకి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్ఓ మంగ్లీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నెమత్ హాలీ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను జాప్యం లేకుండా తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 103 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్ఓ మంగ్లీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా 15 రోజుల నుంచి సెలవులో ఉన్న కలెక్టర్ సోమవారం తిరిగి విధుల్లో చేరారు.

మా భూముల్లో ట్రిపుల్ ఆర్ వద్దు

- తేల్చి చెప్పిన ఆయా గ్రామాల రైతులు
- పాత అలైన్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్
- ఆర్డీఓ, ఎమ్మెల్యే కాంపు కార్యాలయాల వద్ద నిరసన
- సంఘీభావం తెలిపిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు

అనంతగిరి: రీజినల్ రింగ్ రోడ్డు కొత్త అలైన్‌మెంట్ కారణంగా జిల్లా వ్యాప్తంగా రైతులు నష్టపోతారని పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు వేయాలని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ వాసుచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా భూముల్లో ట్రిపుల్ ఆర్ వద్దన్నారు. కొంతమంది బడా నాయకులు వారి భూములను కాపాడుకునేందుకు పాత అలైన్‌మెంట్ మార్పించారని ఆరోపించారు. బడా వెంచర్లను తప్పించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మమ్మల్ని రోడ్డుపాలు చేసేందుకే కొత్త అలైన్మెంట్ తెచ్చారని వాపోయారు. రైతులకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రైతుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ రైతులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా నాయకుడు వడ్లనందు మాట్లాడుతూ.. సొంత లాభం కోసం కొంత మంది రైతులను ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద, చించల్‌పేట్, దాదాపూర్, యావాపూర్, పూడూరు మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

పూడూరు: రీజినల్ రింగ్ రోడ్డు కారణంగా భూములు కోల్పోతున్న రైతులు సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని రాకంచర్ల, పూడూరు, మంచన్‌పల్లి, గొంగుపల్లి, ఎన్కేపల్లి, సిరిగాయపల్లి, కెరవెళ్లి, మన్నెగూడ, తుర్కఎన్కేపల్లి తదితర గ్రామాల రైతులు ఎంపీని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. భూములు పోతే రోడ్డుపాలవుతామని ఆదుకోవాలని కోరారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాలని విన్నవించారు. ఎంపీని కలిసిన వారిలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అనీల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, తాజొద్దీన్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.



ఎంపీ కొండాతో భూ నిర్వాసితులు

సైబర్ నేరాలు తగ్గుముఖం



ధారూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ధారూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అంతకుముందు పీఎస్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ధారూరులో స్థిరపడిన ఇతర రాష్ట్రాల వారిని అక్కడి వ్యాపారులు మోసం చేసినట్లు స్థానిక విలేకరులు ఎస్పీ దృష్టికి తేగా ఎంత మంది.. ఎన్ని కోట్ల రూపాయలు మోసపోయారని అడిగారు. దీపక్ వైష్ణవ్ రూ.6 కోట్లు, సుబ్బారావు రూ.3 కోట్లు మోసం చేసి ఉడాయించారని ఎస్పీకి వివరించారు. ఇలాంటి విషయాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. నిందితుల నుంచి డబ్బు రాబట్టడం ఆలస్యమువుతుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రఘురాం, ఎస్ఐలు రాఘవేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

- నేడు జిల్లాకు 120 మెట్రిక్ టన్నుల రాక
- డీఏఓ రాజరత్నం



తాండూరు రూరల్: ఎరువుల దుకాణంలో రిజిస్టర్ పరిశీలిస్తున్న రాజరత్నం

తాండూరు రూరల్: యూరియా కోసం రైతులు ఆందోళన చెందరాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం అన్నారు. సోమవారం పెద్దేముల్, తాండూరు మండలాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పెద్దేముల్‌లో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 5,47,970 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని తెలిపారు. ఇప్పటి వరకు 22,981 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు చెప్పారు. నేడు(మంగళవారం) జిల్లాకు 120 మెట్రిక్ టన్నులు వస్తుందని వివరించారు. కావున రైతులు ఆందోళన చెందరాదని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఎక్కువ యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 620 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందన్నారు. అవసరం ఉన్న వారు తీసుకెళ్లాలని సూచించారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట తాండూరు ఏడీఏ కొమురయ్య, పెద్దేముల్ ఏఈఓ పవన్ ప్రీతం పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి

బంట్వారం: నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీఏఓ రాజారత్నం అన్నారు. సోమవారం కోట్‌పల్లిలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. నానో యూరియా కొనుగోలు చేస్తే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చని తెలిపారు. అవసరం మేర యూరియా వాడాలని సూచించారు. అతిగా వాడితే అనర్థమని పేర్కొన్నారు. మూడు రోజుల్లో కోట్‌పల్లి మండలానికి 20 టన్నుల యూరియా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓ కరుణాకర్‌రెడ్డి ఏఈఓ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉత్తర్‌ప్రదేశ్ అధికారుల పర్యటన

అనంతగిరి: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కన్సల్టెంట్‌లు శిక్షణలో భాగంగా జిల్లాలో ఈనెల 19 వరకు పర్యటించనున్నారని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలంలోని పులుమద్ది(ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు), నవాబ్‌పేట మండలం లింగంపల్లి గ్రామంలో మధ్యాహ్నం 2 నుంచి పర్యటిస్తారన్నారు. అక్కడ పలువిషయాలపై చర్చించి, పరిశీలిస్తారని తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

యాలాల: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్‌ఐ విఠల్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం అర్ధరాత్రి మండల పరిధిలోని దుబ్బతండా సమీపంలోని కాకరవేణి నది నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. గమనించిన పోలీసులు వాహనాలు ఆపి తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతులు లేవు. దీంతో వాహనాలను సీజ్ చేసి ఠాణాకు తరలించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ గుంతలో పడిన కారు



తాండూరు టౌన్: అదుపు తప్పిన ఓ కారు సరాసరి నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ గుంతలో పడింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సోమవారం తెల్లవారుజామున కొడంగల్ వైపు నుంచి పట్టణంలోని ఇందిరాచౌక్ వైపునకు వచ్చిన కారు డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంతలో అదుపు తప్పి పడిపోయింది. కారు నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండటం వల్ల ఈఘటన జరిగినట్లు తెలిసింది. అతను స్వల్ప గాయాలతో బయటపడగా, అనంతరం కారును క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

యథేచ్ఛగా మట్టి దందా!



మల్లేపల్లితండా సమీపంలో ట్రాక్టర్లలో మట్టి తరలింపు

దోమ: అనుమతులు లేకుండానే పట్టపగలే యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. సోమవారం దోమ మండల పరిధిలోని మల్లేపల్లి తండా సమీపంలోని ఓ ప్రభుత్వ భూమిలో మట్టి దందాను కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. జేసీబీల సహాయంతో ట్రాక్టర్లలో నింపి అమ్ముకుంటున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులకు విషయం తెలిసినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఆమె స్పందించ లేదు.

ధరల బోర్డు ఏర్పాటు



ఎరువుల దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల ఎదుట ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేశారు. యూరియా మొదలుకొని డీఏపీ, ఇతర ఎరువులు ఫర్టిలైజర్ షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని 'సాక్షి'లో కథనం రావడంతో సోమవారం పట్టిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇందులో యూరియా బస్తా ధర మొన్నటి వరకు రూ.320 నుంచి రూ.350కి విక్రయించగా ప్రస్తుతం దాని ధర రూ.266గా, డీఏపీ 1,450 నుంచి 1,350కి దిగి వచ్చాయి. అలాగే (20–20) కాంప్లెక్స్ ఎరువులు కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు దిగివచ్చాయి. ఇన్నాళ్లు తమ దగ్గర ఎరువుల షాపుల యజమానులు ఒక్కో బస్తా ఎరువుకు రూ.80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారని రైతులు తెలిపారు. మరోవైపు అధిక ధరలకు అమ్మిన ఓ షాపు యజమానికి రేపటి వరకు సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

న్యాయం కోరితే అరెస్టులా?

ప్రభుత్వంపై అంగన్‌వాడీల ధ్వజం



బంట్వారం: అంగన్‌వాడీ టీచర్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ శైలజ



బషీరాబాద్: పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయడానికి తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తే పోలీసులు ఆడవాళ్లని చూడకుండా ఈడ్చుకుంటూ అరెస్టులు చేశారని తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బాలమణి మండిపడ్డారు. సోమవారం కొడంగల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి ఆందోళన చేసిన వారిలో 65 మంది అంగన్‌వాడీ టీచర్లను బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు పీఎస్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఎఫ్ఆర్‌ఎస్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మగ పోలీసులు ఆడవారిపట్ల దురుసుగా ప్రవర్తించారని, రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మికి తీవ్రగాయాలు అయ్యాయని మండిపడ్డారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని పోలీసులు విడిచిపెట్టారు. కార్యక్రమంలో నారాయణపేట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరామ్, ఐసీడీఎస్ వికారాబాద్ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయలక్ష్మీ, నారాయణపేట అధ్యక్షురాలు శశికళతో పాటు 65 మంది టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు

బంట్వారం: చలో కొడంగల్ నినాదంతో ధర్నాకు బయలుదేరిన పలువురు అంగన్‌వాడీ టీచర్లను కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. అక్రమ నిర్బంధాలు తమ ఉద్యమాన్ని ఆపలేవని, అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

నీటి వెతలు బోలెడు.. చేతి పంపే చేదోడు

తాండూరు రూరల్: సరైన నీటి సౌకర్యం లేక మండల పరిధిలోని ఓగిపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 49 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో ఒక హెచ్‌ఎం, ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. తాగునీటికి సంబంధించి ఎలాంటి నల్లా కనెక్షన్ లేదని విద్యార్థులు వాపోతున్నారు. తాగడానికి ఇంటి నుంచి వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. అలాగే పాఠశాలలో టాయిలెట్లకు నీటి సరఫరా లేదు. ట్యాంక్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపు నుంచి నీటిని తీసుకొని అవసరాలకు వాడుకుంటున్నామని చిన్నారులు తెలుపుతున్నారు. సోమవారం మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాత చేతిపంపు కొట్టి విద్యార్థులు ప్లేట్లు కడుక్కుంటుండగా 'సాక్షి' కెమెరాకు చిక్కింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు



చేతిపంపు వద్ద ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు

ఒక్కో రైతుకు రెండు బస్తాలు



యూరియా కోసం క్యూలో నిల్చున్న మహిళలు

ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా పంపిణీ

తాండూరు రూరల్: మండలంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం రైతులకు యూరియా సరఫరా చేశారు. స్టాక్ వచ్చిన విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు ఉదయం నుంచే కార్యాలయం వద్ద క్యూలో నిల్చున్నారు. సొసైటీ సీఈఓ శ్రీనివాస్, అదనపు సీఈఓ చంద్రారెడ్డిలతో పాటు కార్యాలయ సిబ్బంది క్యూలో ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల యూరియా టోకెన్లు రాసి ఇచ్చారు. ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయంకు 450 బస్తాల యూరియా వచ్చిందని క్యూలో ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల యూరియా పంపిణీ చేశామని వ్యవసాయశాఖ తాండూరు ఏడీఏ కొమురయ్య తెలిపారు. ఒక్క బస్తా ధర రూ.270కి పంపిణీ చేశామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మాల్ కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచల్కతండాకు చెందిన మోతీలాల్ టాటాసుమో వాహనంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. బియ్యం గురించి ఆయన్ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో వాహనాన్ని టాటాసుమోలో ఉన్న రేషన్ బియ్యంపై విచారించగా సరైన వివరాలు తెలియజేయలేదు. దీంతో వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేసి మోతీలాల్‌ను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కొత్తూరు: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై సోమవారం స్థానికులు ఓ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ మృతదేహం పడిన తీరును పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వయస్సు 30–35 ఏళ్లు, ఉంటుందని తెల్లటి బనియన్ ధరించాడని చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామన్నారు, తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ వినీత్‌కుమార్ ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

జోరుగా రోడ్డు విస్తరణ పనులు

చెట్ల తొలగింపునకు తొలగిన అడ్డంకులు



కొనసాగుతున్న అగ్గనూర్-బషీరాబాద్ రోడ్డు పనులు

బషీరాబాద్: రూ.80 కోట్ల నిధులతో చేపట్టిన అగ్గనూర్-బషీరాబాద్ రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ఉన్నా ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లు తొలగించడానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వడంతో పనులు జోరందుకున్నాయి. సోమవారం కాశీంపూర్ సమీపంలో సుమారు 200 చెట్లను తొలగించారు. దీంతో అగ్గనూర్- బషీరాబాద్ వరకు 16.8 కి.మీ రోడ్డును 13 మీటర్లు(43ఫీట్లు) వెడల్పుతో బీటీ వేయనున్నారు. రోడ్డుకు ఇరువైపుల షోల్డర్స్ 1.5మీటర్ల చొప్పున 3 మీటర్లు విస్తరణ చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రిషీవరుణ్ వివరించారు. అలాగే బషీరాబాద్- మైల్వార్ వరకు 11.6కి.మీ దూరం 7 మీటర్లు(23ఫీట్లు) వెడల్పుతో బీటీ రోడ్డు, షోల్డర్స్ మరో 3 మీటర్లు ఉండేలా విస్తరణ పనులు సాగుతున్నాయన్నారు. అగ్గనూర్ నుంచి విస్తరణ పనులు గొట్టిగఖుర్దు సమీపం వరకు చేరుకున్నాయి. గడువులోపు పనులు పూర్తి చేయడానికి గుత్తేదారుకు ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రతినిధులు

అనంతగిరి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ సోమవారం చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు వడ్ల నందు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధిగా చెల్లిస్తేనే ప్రైవేట్ కళాశాలలు కొనసాగే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని విద్యార్థులకు, యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, భూమయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సింబయాసిస్'లో కార్మికుడి మృతి



అమిత్ కుమార్ మృతదేహం

నందిగామ: వర్సిటీలో వాటర్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు వెళ్లిన కార్మికుడు ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మొద్దళ్లగూడ శివారు సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సోమ వారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రలోని సాతర జిల్లా కున్నీ గ్రామానికి చెందిన అమిత్‌కుమార్ కైమొడే(32) కొంత కాలంగా వర్సిటీలో హిప్రో వాష్ క్లీనింగ్ సర్వీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కళాశాల భవనంపై ఉన్న ట్యాంక్ శుభ్రంచేస్తున్న క్ర మంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. గమనించిన వర్సిటీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీ సీజ్

హయత్‌నగర్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ లారీని పోలీసులు సీజ్ చేశా రు. సీఐ నాగరాజు గౌడ్ తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొ హెడాలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో సోమవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అటుగా వస్తున్న లారీని నిలిపి తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేవు. దీంతో స్థానిక తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ దయాకర్‌రెడ్డిపై కేసు నమో దు చేసి లారీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎనిమిది మంది అరెస్ట్

శంకర్‌పల్లి: పేకాట స్థావరంపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు సంయుక్తంగా సోమవారం దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ శివారులోని అల్ట్రాటెక్ కంపెనీలో పని చేస్తున్న డ్రైవర్లు, కంపెనీలోని వెయిటింగ్ రూంలో పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు దాడులు చేయగా ఎనిమిది మంది పేకాడుతూ చిక్కారు. వారి వద్ద నుంచి రూ.10,970 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గర్భిణికి కుళ్లిన కోడిగుడ్లు

యాచారం అంగన్‌వాడీ కేంద్రంలో వెలుగు చూసిన ఘటన



గర్భిణికి పంపిణీ చేసిన కుళ్లిన కోడి గుడ్లు

బంట్వారం: మండల పరిధిలోని యాచారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయిన ఘటన సోమవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఓ గర్భిణికి రెండు రోజుల కిందట ఇంటికి తీసుకు వెళ్లేందుకు కోడిగుడ్లు ఇచ్చారు. ఆమె సోమవారం ఆమ్లెట్ వేసుకునేందుకు కోడి గుడ్లను పగుల గొట్టగా కుళ్లిపోయి నల్లటి బూజులా బయటికి వచ్చింది. కుళ్లిన గుడ్లు ఇవ్వడంపై ఆ కుటుంబం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మిని సంప్రదించగా.. యాచారం సెంటర్‌లో ఓల్డ్ స్టాక్ పంపిణీ చేసినట్లు తెలిసిందన్నారు. తాను ఎప్పటికప్పుడు గుడ్లతో పాటు ఇతర సరుకులు చెక్ చేస్తూ ఉంటానన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యాలాల: వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందిగా మారిందని, వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విషయంలో ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెట్లి కృష్ణ, నర్సింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో ఏఐ సదస్సు విజయవంతం



మాట్లాడుతున్న డాక్టర్ నీతా పోలే

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే

షాద్‌నగర్‌రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై నిర్వహించిన జాతీయ సదస్సు అందరి సహకారంతోనే విజయవంతమయిందని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే అన్నారు. పట్టణ సమీపంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యాంత్రిక యుగంలో టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం విద్యా బోధనలోనూ మార్పులు తీసుకువస్తోందన్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో ఏఐ పై జాతీయ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గిరిజన గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి సహకారం ఎనలేనిదని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరు విద్యార్థుల్లో సంతోషాన్ని నింపిందని అన్నారు. జాతీయ స్థాయి సదస్సు విద్యార్థుల్లో ఎంతో ప్రేరణకలిగించిందని అన్నారు.

పోక్సో కేసుల తగ్గింపునకు కృషి

ఎస్‌ఐ పుష్పలత

తాండూరు టౌన్: పెరుగుతున్న పోక్సో కేసులను తగ్గించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తాండూరు పట్టణ ఎస్‌ఐ పుష్పలత అన్నారు. సోమవారం షీ టీం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ మార్క్స్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినులకు పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైన సమయంలో స్పందించాల్సిన వివరాలను తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే షీ టీంకు లేదా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలను లైంగికంగా వేధిస్తే, వారిపై పోక్సో కేసు నమోదవుతుందన్నారు. బాలికలకు చట్టాలు, పోలీసు, న్యాయ వ్యవస్థ గురించారు. కార్యక్రమంలో జిల్లా కళాజాత బృందం ఇన్‌చార్జి అశోక్, తాండూరు షీటీం ఇన్‌చార్జి శేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షీటీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన

ఆ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయండి

- స్కావెంజర్ల జీతాల గోల్‌మాల్, మధ్యాహ్న భోజన బిల్లుల అవకతవకలపై విచారణ జరపాలి
- ప్రజావాణిలో అధికారులను కోరిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్



విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రణయ్ తదితరులు

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుని తక్షణమే సస్పెండ్ చేయలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విద్యార్థి సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు. మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. పాఠశాలలో 825 మంది విద్యార్థులకుగాను ప్రభుత్వం స్కావెంజర్ల జీతాల కోసం 2024 ఆగస్టు నుంచి రూ.20వేల చొప్పున విడుదల చేస్తోందని ఇద్దరు స్కావెంజర్లు నియమించి రూ.10వేల చొప్పున జీతం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.7 వేల చొప్పున ఇచ్చి రూ.6 వేలు పక్కదారి పట్టించారని వివరించారు. సమయపాలన పాటించడం లేదన్నారు. మధ్యాహ్న భోజనంలోనూ రిజిస్టర్‌లో పేర్లు రాసి నిధులు దోచుకుంటున్నారన్నారు. స్కావెంజర్ల జీతాల గోల్‌మాల్, మధ్యాహ్న భోజన బిల్లుల అవకతవకల్లో పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్నాయని.. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణ లు సైతం ఉన్నాయని విద్యాశాఖ అధికారులు స మగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కో రారు. లేదంటే విద్యార్థి సంఘాలను కలుపుకొని పె ద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరంగ్, జిల్లా కమిటీ సభ్యులు సిద్దు, తరుణ్, రాహుల్, కిరణ్, భరత్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.